క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందచేస్తున్న కార్పొరేటర్ జమాల్‌పూర్ నవీన్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్‌కు చెందిన వెంకటమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.25 వేల చెక్కును మంగళవారం జమాల్‌పూర్ నవీన్‌కుమార్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం పంపిణీ


ఆర్థిక సాయం అందజేస్తున్న కుమార్, శంకర్, చిరంజీవి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో ఇటీవల మరణించిన కృష్ణ, ఎట్టమ్మ, జ్యోతి, గంగయ్య, వెంకటేశ్ కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి మల్లారెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎంపీటీసీ కుమార్ ముదిరాజ్, బీఆర్‌ఎస్ ఎదులాబాద్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అల్లం శంకర్, చిరంజీవి ముదిరాజ్, వార్డు సభ్యుడు శ్రీనివాస్, లక్ష్మణ్ మృతుల నివాసాలకు వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం వారి కుటుంబీకులకు రూ. 5 వేల చొప్పున రూ. 25 వేలు అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు నాగరాజు, ట్రస్ట్ ప్రతినిధి వేణు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత


విద్యార్థిని బీరం సుమకు ఆర్థికసాయం అందజేస్తున్న రామిడి విజయ్‌రెడ్డి

కీసర: కీసరగ్రామానికి చెందిన ఓ నిరుపేద విద్యార్థిని ఉన్నత చదువులకు అండగా నిలిచేందుకు గ్రామానికిచెందిన రామిడివిజయ్‌రెడ్డి ముందుకొచ్చారు. వివరాల్లోకి వెళితే స్థానిక స్వర్గం గెస్ట్‌హౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన వాచ్‌మెన్ సూరిబాబు మనవరాలు బీరం సుమ స్థానిక స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే ఆమె తాత సూరిబాబు మరణంతో సుమ చదువుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయం తెలియడంతో గ్రామానికి చెందిన రామిడి విజయ్‌రెడ్డి స్వచ్ఛందంగా ముందుకొచ్చి సుమ చదువుకయ్యే ఖర్చును భరిస్తానని తెలిపారు. ఈ మేరకు కళాశాల ఛైర్మన్ మదార్‌తో మాట్లాడి మొదటి సంవత్సరం ఫీజు చెల్లించాడు. పేద విద్యార్థినిని ఆదుకునేందుకు ముందుకొచ్చిన విజయ్‌రెడ్డిని కీసర గ్రామస్తులు అభినందించారు.

ఐఐటీహెచ్‌తో ఎమ్మార్‌ఐఈటీ ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌ఐఈటీ కళాశాల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ కళాశాలతో అకడమిక్ అండ్ రీసెర్చ్ కొలాబరేషన్ పై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఐఐటీ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో విద్యార్థులకు సాంకేతిక విద్య, పరిశోధనలు మెరుగుపరచడంలో ఉపయోగపడుతుందని అశోక్ తెలిపారు.

ఘనంగా మార్కండేయ జయంతి

మేడ్చల్: మార్కండేయ మహర్షి జయంతిని మేడ్చల్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు జనార్దన్, నాగబలరాం, రమేష్, నగేష్, దేవానంద్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న పద్మశాలీలు

చెల్లించాలా..? వద్దా..?

- భూ క్రమబద్ధీకరణ నోటీసుల్లో గందరగోళం..!
- జీఓ 59కు విరుద్ధంగా లబ్ధిదారులకు సీసీఎల్‌ఏ నోటీసులు
- ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం జారీతో బేజారు
- రూ.10 లక్షల నుంచి రూ.80 లక్షలు చెల్లించాలని ఉత్తర్వులు
- జిల్లాలో అర్హులైన 15 వేల మంది దరఖాస్తు దారులకు సొమ్ము చెల్లింపుపై తాఖీదులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: భూ క్రమబద్ధీకరణలో భాగంగా జీఓ 59 కింద అర్హత సాధించిన లబ్ధిదారులకు సీసీఎల్‌ఏ నుంచి జిల్లా కలెక్టర్ పేరుతో జారీ చేసిన నోటీసులు తీవ్ర గందరగోళానికి గురి చేస్తున్నాయి. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సొమ్ము చెల్లిస్తేనే ...ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు భూ క్రమబద్ధీకరణకు అర్హత సాధిస్తారని పేర్కొంటూ... డిమాండ్ నోటీసుల్లో సీసీఎల్‌ఏ పేర్కొంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని బస్తీ, ఏరియా, ప్రాంతాన్ని బట్టి..అక్కడ ఉన్న ప్రస్తుత మార్కెట్ ధరను అనుసరించి అర్హత సాధించిన ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 లక్షల నుంచి మొదలు, రూ.80 లక్షల వరకు భూ క్రమబద్ధీకరణ కోసం చెల్లించాలని నోటీసుల్లో పేర్కొంది.

జీఓ 59 కింద సొమ్ము చెల్లింపు ఇలా..

జీవో 59 కింద 250 గజాల్లోపు ఇళ్లు నిర్మించుకుంటే ఆ ఏరియాలో ప్రభుత్వ ధరలో 25 శాతం చెల్లించాలని రెవెన్యూ శాఖ పేర్కొంది. 251 నుంచి 500 గజాల్లో ఇళ్లు నిర్మించుకుంటే 50 శాతం, 500 నుంచి 1000 గజాల లోపు ఇళ్లు నిర్మించుకుంటే 75 శాతం చెల్లించాల్సి ఉంటుందని 59 జీఓలో పేర్కొన్నారు. ఒకవేళ 1000 చదరపు గజాల పైన ఇంటి నిర్మాణ స్థలం ఉన్నట్లయితే ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు ఇదే చివరి అవకాశమని ప్రభుత్వం జీఓ 14 ప్రకారం 2014 జూన్ 2 నాటికి ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లను మాత్రమే క్రమబద్ధీకరిస్తామని ఆ జీఓలో పేర్కొంది.

జీఓ 59 కింద 28,280 దరఖాస్తులు..

రాష్ట్రంలో అత్యధికంగా మేడ్చల్ జిల్లాలో జీఓ 59 కింద 28,280 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కుత్బుల్లాపూర్ మండలంలో 14,518 దరఖాస్తులు రాగా, కాప్రాలో 5081, కూకట్‌పల్లిలో 5055, ఉప్పల్‌లో 457, దుండిగల్‌లో 1656, మల్కాజిగిరిలో 1424 , బాచుపల్లిలో 1412, మేడిపల్లిలో 583, బాలానగర్‌లో 389 దరఖాస్తులు వచ్చాయి. కీసరలో 697, ఘట్కేసర్‌లో, మీర్‌పేటలో 677, అల్వాల్‌లో 346, మేడ్చల్‌లో 311, ఎంసీపల్లిలో 29 దరఖాస్తులు అందాయి.

అర్హత సాధించినవి 15 వేలు మాత్రమే ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జీఓ 9 కింద భూ క్రమబద్ధీకరణకు 28,280 దరఖాస్తులు రాగా, ఇందులో 15 వేల దరఖాస్తుదారులు మాత్రమే అర్హత సాధించాయి. అర్హత సాధించిన 15 వేల మంది లబ్ధిదారులకు సొమ్ము చెల్లించాల్సిన విధి విధానాలను పేర్కొంటూ సీసీఎల్‌ఏ నోటీసులు జారీ చేసింది.

లబ్ధిదారుల్లో కలవరం

జీఓ 59 కింద భూ క్రమబద్ధీకరణకు సొమ్ము చెల్లించాలని సీసీఎల్‌ఏ జారీ చేసిన డిమాండ్ నోటీసులు అందుకున్న లబ్ధిదారులు షాక్‌కు గురయ్యారు. జీఓ 59 కు విరుద్ధంగా ధరలు నిర్ణయించి నోటీసులు పంపారని ఆరోపిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో సొమ్ము చెల్లించలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ విలువను పేర్కొంటూ... ఇష్టానుసారం రూ.10 లక్షల నుంచి రూ.80 లక్షలు గడువు లోగా చెల్లించాలని నోటీసులు పేర్కొనడంతో ఆందోళనకు గురైన లబ్ధిదారులు సోమవారం పెద్ద ఎత్తున కలెక్టరేట్‌లోని ప్రజావాణికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా తమ ఇబ్బందులను జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నారు.

మచ్చుకు కొన్ని ...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి తన 200 గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇంటిని రెగ్యులరైజ్ చేసుకునేందుకు 59 జీఓ కింద సీసీఎల్‌ఏ నుంచి అందుకున్న నోటీసు ప్రకారం ప్రస్తుత మార్కెట్ విలువ ధరతో రూ.59 లక్షలు చెల్లించాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే, కూకట్‌పల్లి చెందిన మరో మహిళ తన 150 గజాల ఇంటి స్థలాన్ని క్రమబద్ధీకరించుకునేందుకు రూ. 35 లక్షలు చెల్లించాల్సి వస్తోందని కన్నీటి పర్యంతమయ్యింది. ఇలా ఒకరిద్దరు కాదు పదుల సంఖ్యలో లబ్ధిదారులు ప్రతి రోజు కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మూడు నెలల్లో రూ. లక్షల సొమ్ము చెల్లించే స్తోమత ఉంటే ఎప్పుడో ప్రైవేట్ వెంచర్లలో ఇంటి స్థలాలు కొనుక్కునే వాళ్లం కదా..? అని వారు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఏమి చేయాలో..పాలుపోని స్థితిలో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు సైతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏమి చేయాలో తోచక అమోయమస్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి ఏలా తీసుకెళ్లాలని తర్జనభర్జన పడుతున్నారు. జీఓ 59 కింద భూ క్రమబద్ధీరకరణ విషయంలో పునరాలోచించి ప్రస్తుత మార్కెట్ విలువ ధర తగ్గించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా అధికారుల సమీక్షలో కలెక్టర్ హరీష్



సాక్షి,మేడ్చల్ జిల్లా: నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో ఈనెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరీష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున పెరేడ్ మైదానంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. దీనికి సంబంధించి జాతీయ పతాకం ఏర్పాటు నుంచి సభావేదిక అలంకరణ, ప్రొటోకాల్ తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, లా ఆఫీసర్ చంద్రావతి , ఏసీపీ రామ లింగరాజు, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్‌నగర్‌లోని ఆర్యవైశ్య సంఘం భవన్‌లో ఏర్పాటుచేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామలింగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బల్లి రోజాశ్రీనివాస్, అంబేద్కర్‌నగర్ ఆర్యవైశ్యం సంఘం అధ్యక్షులు నంగునూరి అశోక్, ఆరోగ్య విస్తరణ అధికారి షౌకత్ అలీ, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎదులాబాద్ గ్రామసభ రసాభాస

- కార్యదర్శికి అవమానం
- ఇంటి పన్ను చెల్లించాలన్నందుకు ఆగ్రహం
- అక్రమాలపై సమాధానమివ్వాలని నిలదీసిన స్థానికులు


ఎదులాబాద్ గ్రామసభలో వాగ్వాదం చేస్తున్న ప్రజలు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. సభ ప్రారంభం కాగానే గ్రామంలో చేపట్టిన అక్రమ కట్టడాలు, ఇంటి నిర్మాణాల అనుమతి, నకిలీ రశీదులు సృష్టించి పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారని స్థానికులు ఆరోపించారు. ప్రజల నుంచి నుంచి వసూలు చేసిన డబ్బుకు సరైన రశీదు ఇవ్వడం లేదన్నారు. ఇచ్చిన రశీదుల నెంబర్లు పొంతన లేకుండా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై కార్యదర్శి, సర్పంచ్, పాలకవర్గం సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఉష మాట్లాడుతూ పంచాయతీలో అవినీతికి ఆస్కారం లేదని, ప్రతి నెల పంచాయతీ రికార్డులు ఎంపీఓ, ఎంపీడీఓ, డీఎల్పీఓ, డీపీఓ, అదనపు కలెక్టర్ తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

కార్యదర్శి చీర లాగిన మహిళ

గ్రామంలో అవినీతి ఆరోపణలపై చర్చ జరుగుతుండగానే గ్రామానికి చెందిన పూస లక్ష్మీబాయి మైక్ లాక్కుని మాట్లాడింది. ఇంటి పన్ను చెల్లించలేదని నల్లా కనెక్షన్ తొలగించే క్రమంలో తన మనవడిని దూషించిందని ఆరోపించారు. ఈ క్రమంలో స్టేజీపై ఉన్న కార్యదర్శి ఉషను దుర్భాషలాడుతూ ఆమె చీరను లాగేసింది. దీంతో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ సురేశ్, ఉప సర్పంచ్ లింగేశ్వర్, ఎంపీటీసీలు రవి, సరళ, పాలకవర్గ సభ్యులు నివ్వెరపోయారు. సభలో గందరగోళం నెలకొంది. ఇంటి పన్ను చెల్లించకుండా కొందరి ప్రోద్బలంతోనే అసభ్యకరంగా వ్యవహరించారని ఆరోపిస్తూ కార్యదర్శి వేదిక పైనుంచి దిగి వెళ్లిపోయారు. సమస్యలపై నిలదీయాలే కాని సభలో కార్యదర్శిని అవమానించడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసులకు గ్రామకార్యదర్శి ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ గ్రామ సభలో పూల లక్ష్మీబాయి అనే మహిళ తన చీర లాగి అవమానించిందని బాధితురాలు గ్రామ కార్యదర్శి ఉష ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ అశోక్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎదులాబాద్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో గ్రామాభివృద్ధిపై చర్చిస్తుండగా అదే గ్రామానికి చెందిన పూల లక్ష్మీబాయి తన చేతిలోనుంచి మైక్ లాక్కోవడమేగాక తనను అసభ్యకరంగా దూషిస్తూ ప్రజల మధ్య చీరను లాగేసిందని ఫిర్యాదు చేశారన్నారు. ఉప సర్పంచ్ ఉప్పు లింగేశ్వర్, బెల్లం శ్రీనివాస్, ఆంజనేయులు, అరుట్ల బాల్‌రాజ్ ప్రోద్బలంతోనే ఆమె ఈ చర్యకు పాల్పడినట్లు కార్యదర్శి ఉష ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓటు ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన

కీసర: జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్‌జిల్లా, కీసర మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినులు ఎస్.కృష్ణవేణి, రూపవతి విద్యార్థినీ, విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత, విలువ, ఎన్నికల నిర్వహనపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు. ఈ నిర్వహణ కార్యక్రమంలో ఏఏ అధికారులు పాల్గొంటారు. నాయకులు ఎలా పోటీ చేస్తారు, ప్రచారం, ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు సోదాహరంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్థానిక కౌన్సిలర్ సరితారమేష్, కళావతి, లక్ష్మి, నాగేష్, ఎస్‌ఎంసి ఛైర్మన్ మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

మేడ్చల్‌రూరల్: మండలంలోని డబిల్‌పూర్, రాయిలాపూర్ గ్రామాల్లో బుధవారం మంత్రి మల్లారెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీడీఓ పద్మావతి, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్ తెలిపారు. డబిల్‌పూర్‌లో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభోత్సవంతో పాటు రెండు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మంత్రి చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

మార్కెటింగ్ పద్ధతులను మార్చుకోవాలి

తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి



సాక్షి,మేడ్చల్ జిల్లా: అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత మార్కెట్లలో మార్కెటింగ్ పద్ధతులను మార్పులకు అనుగుణంగా మార్చుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. మంగళవారం రాంపల్లి కేజీఆర్ కళాశాలలో 'మారుతున్న మార్కెటింగ్ ధోరణుల'పై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ప్రస్తుతం గ్రామీణ మార్కెట్‌లో మార్కెటింగ్ విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొఫెసర్ విద్యాధర్‌రెడ్డి మాట్లాడుతూ, మార్కెటింగ్ ప్రవేశించని ప్రదేశం లేదని, వ్యక్తిగత మార్కెటింగ్ అత్యంత ప్రధానమైందన్నారు. మార్కెటింగ్, నిన్న, నేడు, రేపు అనే అంశాలపై సదస్సులో విస్తృతమై చర్చ జరగాలన్నారు. ఉన్నత విద్యలో బోధన, పరిశోధన, విస్తరణ అనే విధులను ఉన్నత విద్యా సంస్థలు నిర్వహించాలని, అందులో భాగంగా ఈ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు కేజీఆర్ కళాశాల డైరెక్టర్ ,సెమినార్ ఛైర్మన్ పీవీ రమణారావు తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కేజీఆర్ కళాశాల ఛైర్మన్ డా. గోవిందరెడ్డి కళాశాల స్థాపన, విస్తరణ, భవిష్యత్ కార్యకలాపాలను వివరించారు. సదస్సులో కళాశాల కార్యదర్శి కె.నితిన్‌రెడ్డి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి , కేరళ కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువను త్వరలో పూర్తి చేస్తాం


మంత్రి మల్లారెడ్డితో నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీపరిధిలోని కోమటి కుంట చెరువు నుంచి చర్లపల్లి చెరువు వరకు వరద నీటి కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను పరిష్కరించనున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం నాగారం మున్సిపల్ ఛైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ ఛైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్‌తోపాటు, పలువురు కౌన్సిలర్లు, స్థానిక కాలనీల నేతలు మంత్రి మల్లారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వర్షాకాలంలో వరదల వల్ల నాగారం మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన వరదనీటి కాలువ పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వరదనీటి కాలువ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులను కేటాయించడం జరిగిందన్నారు. మొదట చర్లపల్లి చెరువు నుండి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

పట్టా భూమిలో మార్కెట్ నిర్మాణం వద్దు


తొలగించిన బేస్‌మెంట్‌ను చూపిస్తున్న బాధితులు

పోచారం: అన్నోజిగూడలోని వికలాంగుల కాలనీ వద్ద నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌ను ప్రభుత్వ భూమితో పాటు పక్కనే ఉన్న పట్టా భూమిలో నిర్మిస్తున్నారని బాధితులు శ్రీనివాస్ గౌడ్, పద్మావతి ఆరోపించారు. మంగళవారం అన్నోజిగూడలోని సర్వే నంబర్ 16లోని తమ స్థలంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే నంబర్ 14లోని ప్రభుత్వ భూమితో పాటు సర్వే నంబర్ 16లోని 900 చదరపు గజాల తమ ఖాళీ స్థలాన్ని ఆక్రమించి పోచారం పురపాలక సంఘం మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందన్నారు. తమ జాగాను వదిలిపెట్టి ప్రభుత్వ భూమిలోనే మార్కెట్ నిర్మించుకోవాలన్నారు. 1987 నుండి ఇప్పటి వరకు అన్ని లింక్ డాక్యుమెంట్లు, ఓనర్‌షిప్ డీడ్ ఉన్నప్పటికీ తమ స్థలంలోని బేస్‌మెంట్‌ను తొలగించి మార్కెట్ నిర్మాణం కోసం గుంతలు తవ్వారని ఆరోపించారు. పనుల ప్రారంభ సమయంలోనే రెవెన్యూ, మున్సిపల్, కలెక్టర్ కార్యాలయాల్లో అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

గ్రేవ్ యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న రెవెన్యూ అధికారులు

మేడ్చల్: ముస్లిం గ్రేవ్ యార్డు ఏర్పాటుకు మేడ్చల్ పట్టణంలో రెవెన్యూ అధికారులు ముస్లిం నాయకులతో కలిసి మంగళవారం స్థల పరిశీలన చేశారు. గ్రేవ్ యార్డు ఏర్పాటు చేయాలని ముస్లింలు పలుమార్లు జిల్లా కలెక్టర్‌ను కోరడంతో ఆయన ఆదేశాల ప్రకారం అధికారులు స్థల పరిశీలన చేశారు. రావల్ కోల్ ,గౌడవెల్లి గ్రామాల పరిధిలో అధికారులు స్థలాలను పరిశీలించారు. గౌడవెల్లి గ్రామంలో నాలుగు ఎకరాలు, రావల్‌కోల్ లో రెండున్నర ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. గౌడవెల్లి స్థలాన్ని కేటాయించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రకాంత్ ముస్లీం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం


మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

మేడ్చల్: మేడ్చల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ విజయకుమారి పాఠశాలలో నిర్వహిస్తున్న మార్షల్ ఆర్ట్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల స్వీయరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. బాలికలు చదవులతో పాటు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని అన్నారు. జిల్లా బాలికల పాఠశాలలో మార్షల్ ఆర్ట్స్ నేర్పేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సమావేశంలో బాలికల సాధికారిత, సమాజంలో ప్రాధాన్యత వంటి అంశాలపై బాలికలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, ఎంఈఓ వసంతకుమారి ఉపాధ్యాయులు, బాలికలు ,నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ నర్సింహారెడ్డి

మేడ్చల్‌రూరల్: వాహనదారులు ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ లింగం, సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభినవ్ రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి, జడ్పీ ఛైర్మన్


నిరసన వ్యక్తం చేస్తున్న రాజబొల్లారం గ్రామస్తులు

మేడ్చల్‌రూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల వికాసానికి కృషి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘనాపూర్, అక్బర్జాపేట్ గ్రామాల్లో రూ.50 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు జిల్లా పరిషత్ ఛైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో నిలిచాయన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. బీజేపీ నాయకులు నిత్యం తమ నాయకుడిపై మాటలు, విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. రానున్న రోజుల్లో దేశంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, జిల్లా రైతు సమితి అధ్యక్షులు నందారెడ్డి, ఉప సర్పంచ్ నారాయణగౌడ్, ఎంపీటీసీ అంకిత, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు దయానంద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు.

కావాలనే మంత్రి మా ఊరికి రాలేదు

రాజబొల్లారం గ్రామస్తులు

మంగళవారం రాజబొల్లారం గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి మల్లారెడ్డి కావాలనే తమ గ్రామానికి రాలేదని రాజబొల్లారం గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 38లోని ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుండటంతో సదరు స్థలంలో మినీ ఫంక్షన్‌హాల్ నిర్మించాలని గ్రామ పంచాయతీలో తీర్మానం చేయించామన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రితో కొబ్బరికాయ కొట్టించాలని గ్రామస్తులమంతా భావించామన్నారు. అయితే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారు మంత్రికి తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామాలైన ఘనాపూర్, అక్బర్జాపేట్ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కనీసం తమ గ్రామం మీదుగా వెళ్తాడని భావించామని, మెడిసిటీ చౌరస్తా వద్ద మంత్రిని కలిసి గ్రామంలోకి రావాలని కోరామన్నారు. అయితే స్థానిక ఉపసర్పంచ్, ఎంపీపీ కారణంగా మంత్రి తమ గ్రామంలోకి రాలేదని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా పాలు కాకుండా కాపాడుకుంటామన్నారు.